## క్లుప్తంగా

### సర్వసభ్య సమావేశం నేడు

పాయకరావుపేట: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు తెలిపారు. సమావేశానికి మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల మండల అధికారులు హాజరు కావాలన్నారు.

### నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మునగపాక: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న మునగపాక-2, గంటవానిపాలెం, 25న అరబుపాలెం, నాగవరం, 26న తోటాడ, నాగులాపల్లి-1, 27న వాడ్రాపల్లి, పల్లపు ఆనందపురం గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు.

### పశుదాణా బేసిన్లు పంపిణీ



బేసిన్లు అందజేస్తున్న పాల సంఘం అధ్యక్షుడు గంగాధర్

మునగపాక: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ సేవలందిస్తుందని అరబుపాలెం పాలసంఘ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ కోరారు. అరబుపాలెం పాల సొసైటీ రైతులకు సోమవారం ఆయన పశు దాణా బేసిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నాణ్యమైన పాలను సరఫరా చేసి ఆర్థికంగా నిలబడాలన్నారు. పోషక విలువలతో కూడిన దాణాను పశువులకు అందించాలన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, సంఘ వేతన కార్యదర్శి బి.కృష్ణ, పాల సంఘ డైరెక్టర్లు పాల్గొన్నారు.

### తల్లికి వందనం వర్తింపచేయాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాయకరావుపేట: తల్లికి వందనం పథకం నగదు తమకు విడుదల చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. కార్యకర్తలకు రూ.11,500, ఆయాలకు, మినీ కార్యకర్తలకు రూ.7 వేలు చొప్పున వేతనం మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఈ మొత్తంతో జీవనాధారం కష్టంగా ఉన్నందున తమ పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ సిహెచ్ ఆర్.కె. వర్మకు వినతి పత్రం అందించారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఎంతగానో దోహదపడుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ఈ కార్యక్రమం దృష్టికి తీసుకురావడం ద్వారా అనతికాలంలోనే పరిష్కారం అవుతాయన్నారు. వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. మండల ఇంజనీరింగ్ అధికారి గులామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఈవోపీఆర్డీ సోమరాజు, సూపరింటెండెంట్ ప్రసాద్, వెలుగు ఏపీఎం బాలరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### గ్రామ పండగను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న యలమంచిలి సీఐ ధనుంజయరావు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో పోతురాజు బాబు పండగను మంగళవారం ప్రశాంతంగా జరుపుకోవాలని యలమంచిలి సీఐ ధనుంజయరావు కోరారు. ఎవరైనా సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉమ్మలాడలో సోమవారం ఆయన సాంస్కృతిక ప్రదర్శనల నిర్వాహకులతో సమావేశమయ్యారు. పండుగ సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. కుల, మతాలకు అతీతంగా పండగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

# అల్లుకున్న నిర్లక్ష్యం



యలమంచిలి కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా విద్యుత్ స్తంభం పరిస్థితి



ఏరియా పశువుల ఆస్పత్రి ఎదురుగా విద్యుత్ స్తంభానికి ప్రమాదకరంగా ఎగబాకిన మొక్కలు



షణ్ముఖ లేఅవుట్ సమీపంలో..



సోమన్నపాలెం సమీపంలో..



యలమంచిలి విద్యుత్ ఏఈ కార్యాలయానికి ఆనుకున్న స్తంభం, వైర్లకు అల్లుకున్న మొక్కలు



పురుషోత్తపురం విద్యుత్ ఉపకేంద్రం వద్ద..

- విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగజాతి మొక్కలు
- గాలి వీచినా, చినుకులు కురిసినా కరెంట్ కట్
- అస్తవ్యస్తంగా విద్యుత్ లైన్ల నిర్వహణ
- పలుచోట్ల స్తంభాలు, వైర్లకు పాకిన మొక్కలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- యలమంచిలి పట్టణం, మండల ప్రజల అవస్థలు

యలమంచిలి రూరల్:

చిన్నపాటి గాలి వీచినా..చినుకులు కురిసినా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గంటల కొద్దీ బ్రేక్ డౌన్లతో సరఫరా నిలిచిపోతోంది. **యలమంచిలి పట్టణం, మండలంలో పక్కనే నిత్యం వేలాది మంది ప్రయాణించే ప్రధాన రహదారుల పక్కనే హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు, నియంత్రికలకు తీగజాతి మొక్కలు, చెట్ల కొమ్మలు అల్లుకుపోయి ఈ పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా యలమంచిలి విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈ కార్యాలయాలకు ఆను**కుని, సమీపంలో పశువుల ఆస్పత్రి, కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు, చెట్ల కొమ్మలు అల్లుకుపోయినా పట్టించుకోకపోవడం ఆ శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పొచ్చు. ఇక యలమంచిలి నుంచి రేగుపాలెం వెళ్లే పాత జాతీయ రహదారి పక్కన షణ్ముఖ లేఅవుట్‌కు ఎదురుగా, సోమన్నపాలెం సమీపంలో, పురుషోత్తపురం 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పక్కనున్న జగనన్న కాలనీకి వెళ్లే సీసీ రహదారికి రెండువైపులా, పురుషోత్తపురం నుంచి మైహోం కర్మాగారానికి వెళ్లే రహదారి పక్కన **విద్యుత్ స్తంభాలకు మొక్కలు అల్లుకున్నాయి. ఇవే కాకుండా మరికొన్ని చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు ఎర్తింగ్ కూడా సక్రమంగా ఏర్పాటు చేయలేదు.**

**వర్షాకాలంలో**

**రానున్న వర్షాకాలంలో చెట్లకు విద్యుత్ ప్రసరిస్తే మనుషులకు, జీవాలకు ప్రమాదాలు జరిగే ఆవ**కాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా చిన్నపాటి వర్షం, గాలులకే ఫీడర్లు ట్రిప్పవడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం షరామామూలుగా ఉంటోంది. యలమంచిలి -రేగుపాలెం రహదారి మీదుగా నిత్యం స్థానిక విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రయాణిస్తుంటారు. ఈ రహదారి పక్కనే విద్యుత్ స్తంభాలకు మొక్కలు అల్లుకున్నా వారు పట్టించుకోకపోవడం ఏమిటని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ బిల్లు కాస్త ఆలస్యమైనా సరఫరా నిలిపివేస్తామంటూ సిబ్బంది **బెదిరిస్తుంటారు. నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడంపై నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో నష్టాలను నివారించేందుకు కరెంట్ స్తంభాలు, తీగల చుట్టూ పిచ్చిమొక్కలు పెరగకుండా చూడాల్సిన అధికారులు తీగ మొక్కలు పై వరకు ఎగబాకి వైర్లతోపాటు స్తంభాలను పూర్తిగా కప్పే**సినా పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ప్రీ మాన్‌సూన్ నిర్వహణ పేరుతో లక్షలాది రూపాయలు కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నా, ఆ పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం తరచూ సరఫరా నిలిపివేస్తూ ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్న ఆ శాఖ అధికారులు పీఎంఐ కటింగ్ పనులను పక్కాగా పర్యవేక్షించి, అంతరాయంలేని, సురక్షితమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### విద్యుత్ లైన్ల నిర్వహణపై నిర్లక్ష్యం



విద్యుత్ స్తంభాలు,లైన్ల నిర్వహణ పనుల్లో పారదర్శకత లోపిస్తోంది. గతంలో ఏడాదికి ఒకసారి రెండు లేదా మూడు నెలలు మాత్రమే చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టేవారు. ఇటీవల తరచూ పీఎంఐ కటింగ్ చేస్తున్నారు. ఇందుకోసం 5 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా సైతం నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ విద్యుత్ స్తంభాలు, వైర్లకు మొక్కలు అల్లుకుపోయి ఉంటున్నాయి. అధికారులు నిర్లక్ష్యం వీడి అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి. – చాకలి నూకరాజు, ఆర్టీఐ కార్యకర్త, జంపపాలెం

### విద్యుత్ స్తంభాలకు మొక్కలు అల్లుకున్నాయి



ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున తీగజాతి మొక్కల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకోవచ్చు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. రైతులకు, విద్యుత్ వినియోగదారులకు ఏదైనా సమస్య వచ్చినా, స్పందించే విషయంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మరింత చొరవ తీసుకోవాలి. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా ఇళ్లలో విద్యుత్ సంబంధిత గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయి. – కె. పద్మ, ప్రైవేటు ఉద్యోగి, యలమంచిలి

### మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం

వర్షాకాలంలో తీగజాతి మొక్కలు, చెట్ల కొమ్మలు తొందరగా ఎదిగి విద్యుత్ స్తంభాలు, వైర్లకు అల్లుకుపోతాయి. ఎప్పటికప్పుడు వీటిని తొలగించే పని చేయిస్తున్నాం. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా చెట్ల కొమ్మలు, మొక్కలు అల్లుకుపోతే ప్రజలు మా శాఖ దృష్టికి తీసుకురావచ్చు. వెంటనే అవసరమైన చర్యలు తీసుకుంటాం. – చెక్కా కనకరాజు,అసిస్టెంట్ ఇంజనీర్,ఏపీఈపీడీసీఎల్,యలమంచిలి

## యోగాంధ్ర విజేతకు అభినందనలు



రామలక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: యోగాంధ్ర వ్యాసరచన పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొంకిపూడి రామలక్ష్మిని ఉపాధ్యాయులు అభినందించారు. యోగాంధ్ర మండల, జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంది. సోమవారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. సర్పంచ్ కోసూరు అప్పారావు, ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్, స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను సత్కరించారు. హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉండాలన్నారు. అన్ని రంగాలలో రాణించేలా కృషి చేయాలని సూచించారు. మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం వై.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు లోవరాజు పాల్గొన్నారు.

## బదిలీ వైద్య సిబ్బందికి సత్కారం



వైద్యురాలు సుజాతను సత్కరిస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఆయుష్ ఆస్పత్రిలో పంచకర్మ వైద్య సేవలందించి విశేష మన్ననలు పొందిన వైద్యురాలు సుజాత, ఫార్మసిస్ట్ రామకృష్ణలను గ్రామస్తులు, వైద్య సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. సర్వసిద్ధి ఆస్పత్రికి వైద్యురాలు సుజాత, నక్కపల్లి మండలం వేంపాడు ఆస్పత్రికి ఫార్మసిస్ట్ రామకృష్ణ బదిలీ అయ్యారు. కొరుప్రోలు వైద్యశాలలో చివరి రోజు వీరు సేవలను కొనియాడారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పంచకర్మ వైద్య సేవలు విశేషంగా ప్రజలకు అందించారన్నారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని తోటాడలో జన సంఘ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి నాగేశ్వరరావు, పార్టీ నేతలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే కోల్‌కత్తాలోని విశ్వవిద్యాలయానికి కులపతిగా ముఖర్జీ నియమితులయ్యారన్నారు. 1949లో ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నుంచి తప్పుకొని 1951లో జన సంఘ పార్టీని స్థాపించి విశేష సేవలందించారన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మళ్ల కాలేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, పార్టీ మండల నాయకుడు పొలమరశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

## వర్షపు నీటి నిల్వలు దోమలకు స్థావరం



మత్స్యకారులకు జాగ్రత్తలను వివరిస్తున్న ఆరోగ్య సహాయకుడు అప్పలకొండ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అచ్యుతాపురం రూరల్: వర్షపు నీటి నిల్వలను దోమలు స్థావరంగా చేసుకుని వ్యాధులకు కారణమవుతాయని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రావ్య తెలిపారు. మలేరియా నివారణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పూడిమడక పుర వీధుల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన వర్షపు నీటిలోనే మలేరియా దోమ సంతానోత్పత్తి చేస్తుందన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కొబ్బరి బొండాలు, సైకిల్ టైర్లు, ప్లాస్టిక్ టబ్బులు, ఫ్రిడ్జ్ వెనుకాల నీరు నిల్వ లేకుండా అప్రమత్తంగా ఉండలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు లండా అప్పలకొండ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణ పంచాయతీలుగా గ్రామాలు



గ్రామ కార్యదర్శులతో డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్

పాయకరావుపేట: మండలంలో అన్ని గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సోమవారం గ్రామ సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలన్నారు. అదేవిధంగా పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు వసూళ్లు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

## గ్రావెల్ లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు పట్టుకున్నారు., ఉపమాక వద్ద ఈ లారీని పట్టుకున్నట్లు సీఐ కుమార స్వామి తెలిపారు. తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పట్టుబడ్డ లారీ అమలాపురం ప్రాంతానికి చెందిన కూటమి నాయకుడిదని సమాచారం.

## మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులో సోమవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ దొర మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు.

## కొనసాగుతున్న మత్స్యకారుల ఆందోళన



ఆందోళన కొనసాగిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: అమలాపురంలో భూములకు నష్టపరిహారం మత్స్యకార సొసైటీకే చెల్లించాలంటూ మత్స్యకారులు చేస్తున్న ఆందోళన సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. సొసైటీ పేరున నష్టపరిహారం చెల్లించిన తర్వాత భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ వారంతా పనులు జరిగే ప్రాంతాల్లో ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని మత్స్యకారులు తెలిపారు. రాంబిల్లి మండలంలో మత్స్యకార సొసైటీ భూములు కంపెనీల కోసం తీసుకుంటే పరిహారం చెల్లించారని, ఇక్కడా అలాగే చెల్లించాలని వారు కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: ఖరీఫ్‌లో చేపట్టవలసిన చర్యలు, ప్రకృతి వ్యవసాయం గురించి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.ఉమాప్రసాద్ వివరించారు. పట్టణంలోని సబ్ డివిజన్లోని ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో ఏడీఏ ఆఫీస్‌లో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు వరి విత్తనాలు, పిచ్చిరొట్ట విత్తనాలు అందించాలని, అర్హత కలిగిన వారికి అన్నదాత సుఖీభవ వచ్చేటట్లు చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు తెలిపారు. కార్యక్రమంలో పాయకరావుపేట, నక్కపల్లి, నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల ఏవోలు ఆదినారాయణ, ఉమాప్రసాద్, సుగుణ, సరోజిని, అప్పారావు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయం



పదిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మునగపాక: విద్యాభివృద్ధికి రాజగృహ విద్యానిలయం అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని అరబుపాలెం రాజ గృహ విద్యాలయం దశమ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం రాత్రి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డీఎస్ఆర్ అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ రాజగృహ విద్యాలయం ద్వారా ఏటా విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని లక్ష్యాలను చేరుకోవాలన్నారు. 2015లో విద్యాలయాన్ని దువ్వాడ అచ్చియ్యనాయుడు తన సొంత నిధులతో స్థాపించారని, నాటి నుంచి ఎంతోమంది విద్యార్థులను ప్రోత్సహిస్తూ వస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్ లంబా అప్పారావు, దువ్వాడ కులదీప్, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణ్, జేవీ ప్రభాకర్, గారా సత్యనారాయణ, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, బాల పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నతి సాధ్యం



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న క్షత్రియ పరిషత్ ప్రతినిధులు

కోటవురట్ల: విద్యతోనే ఉన్నతి సాధ్యమని క్షత్రియ పరిషత్, నర్సీపట్నం వైస్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ సత్యనారాయణరాజు తెలిపారు. క్షత్రియ యూత్ వింగ్ ఆధ్వర్యంలో మండలంలో తంగేడు, లింగాపురం, తిమ్మాపురం, సన్యాసిరాజుపాలెం ఎంపీపీ స్కూల్స్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సత్యనారాయణరాజు మాట్లాడుతూ పేదరికాన్ని పారదోలాలంటే లక్ష్యాన్ని ఏర్పరుచుకుని పట్టుదలతో చదవాలన్నారు. చెడు వ్యసనాల జోలికి పోకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో క్షత్రియ యూత్ వింగ్ ప్రెసిడెంట్ దాట్ల సత్యనారాయణరాజు, వైస్ ప్రెసిడెంట్ డీఎస్ఎన్ రాజు, ట్రెజరర్ పాకలపాటి పాండురంగరాజు, సెక్రటరీ అల్లూరి శ్రీరామరాజు, సర్పంచులు కొరుప్రోలు శివకుమార్, కె.వరహాలబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొరుప్రోలు రమణ, వైబోయిన రమణ పాల్గొన్నారు.